నమస్తే తెలంగాణ

మెదక్

I హైదరాబాద్, మంగళవారం 3 జూన్ 2025 MEDAK




# త్యాగాల ఫలమే స్వరాష్ట్రం

- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు



బీఆర్ఎస్ మెదక్ జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 2: ఎందరో త్యాగాల ఫలమే స్వరాష్ట్రమని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి తదితర బీఆర్ఎస్ నేతలతో కలిసి జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం ఎంతో మంది పోరాటలు చేసి అమరులయ్యారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో 14 ఏండ్ల పాటు ఎన్నో ఉద్యమాలు చేసి శాంతియుతంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆంజనేయులు, కృష్ణాగౌడ్, లింగారెడ్డి, బాలగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజగౌడ్, కిష్టయ్య, జుబేర్ అహ్మద్, నగేశ్, రాధ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, మల్లేశం, రబ్బీ పాల్గొన్నారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో...**

మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో డీటీవో వెంకటస్వామి, మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ జాతీయజెండాలను ఎగురవేశారు.

# నత్తనడకన గౌరవెల్లి ప్రాజెక్టు పనులు




హుస్నాబాద్‌లో జాతీయజెండాకు వందనంచేస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ తదితరులు

## మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌టౌన్, జూన్ 2: బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తీరుతో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయజెండా, బీఆర్ఎస్ జెండాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.30లక్షలు ఇప్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన చర్చల్లో ఎకరాకు రూ.17లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఇది రైతులకు అన్యాయం చేయడం తప్పా వేరేకాదన్నారు. కాల్వల నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేశామని గొప్పలు చెబుతున్న మంత్రి ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు సేకరించారో, పరిహారం ఎందరికి ఇచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ. 22లక్షల పరిహారం, ఇండ్లు, ఉద్యోగం ఇస్తున్నట్లుగానే గౌరవెల్లి రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గౌరవెల్లి రిజ్వాయర్ స్థాయిని పెంచి, పంప్‌హౌజ్‌ను ప్రారంభించి, ట్రయల్‌రన్‌ను సైతం నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం జరిగిందన్నారు. మహాసముద్రంతోపాటు పలు చెరువులను సైతం పునరుద్ధరించే కార్యక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగాయన్నారు. శనిగరం ,సింగరాయ ప్రాజెక్టులను సైతం పునరుద్ధరించి సాగునీటిని అందించి వ్యవసాయాన్ని సాగులోకి తీసుకువచ్చామన్నారు. మాతాశిశుకేంద్రాన్ని ప్రారంభించలేదని, 150 పడకల దవాఖాన ఎక్కడికి పోయిందని, ఇంజినీరింగ్ కళాశాల సాంకేతిక శాఖ నుంచి కాకుండా యూనివర్సిటీ నుంచి మంజూరుచేసి ప్రజలకు దూరంగా ఉండే ప్రాంతంలో పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎల్కతుర్తిలో ట్రిపుల్ఐటీ సైతం ఏర్పాటుచేస్తామని చెప్పారని, ప్రజలకు మంత్రికి సరైన సంబంధాలు లేవనే విషయాన్ని గుర్తించాలన్నారు. నియోజకవర్గంలో తాము మంజూరు చేసిన నిధులతో చేపట్టే పనులు తప్పా కొత్తపనులు ఏవీ కనిపించడంలేదన్నారు. మాజీ సర్పంచ్‌లకు బిల్లులు మంజూరుచేయాలని, కాంట్రాక్టర్ల బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ మారపల్లి సుధీర్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వ ర్, మాజీ ప్రజాతినిధులు ఆకుల రజితా వెంకన్న, సుద్దాల చంద్రయ్య, భూక్యా మంగ, లక్ష్మి, మానస, రజినీ, తిరుపతిరెడ్డి, తిప్పారపు శ్రీకాంత్, వంగ రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కొత్త శ్రీనివాసరెడ్డి లక్ష్మణ్, కాసర్ల అశోక్‌బాబు, లింగాల సాయన్న, గద్దల రమేశ్, వంగవెంకట్రామిరెడ్డి, బండి రమణారెడ్డి, కొడముంజ రమేశ్, కన్నోజు రామకృష్ణ, గూళ్ల రాజు, మాలోతు బీలునాయక్, అయిలేని అనిత, వాల సుప్రజ, బిల్ల వెంకటరెడ్డి, కొంకట నళినిదేవి, యాటకార్ల స్వరూప, గొర్ల నాగయ్య, చంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భూ బాధితులకు అండగా ఉంటా

## మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడిదల భూ బాధిత రైతులు

గుమ్మడిదల, జూన్ 2: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల సర్వే నెంబర్ 109 భూమి విషయంలో బాధిత రైతులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు సోమవారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిసి తమ సమస్యలు వివరించారు. రైతుల ఆవేదన విన్న ఆయన వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కో రైతుకు 600 గజాల భూమి ఇవ్వాలని నిర్ణయించామని, దాని విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని నేటి ప్రస్తుత విలువ రూ.2 కోట్లు ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా లగచర్లలో రైతులకు పరిహారం చెల్లించి ఉద్యోగాలు ఇచ్చినట్లు, అదే తరహాలో గుమ్మడిదల రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుత ప్రభుత్వం పరిహారం విషయమై గ్రామ పంచాయతీలో మూడు రెట్లు, మున్సిపల్ పరిధిలో రెండు రెట్లు ఇవ్వాలని చెబుతున్నదని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, రాజేశ్, నాయకులు బాలకృష్ణారెడ్డి దేవేందర్‌రెడ్డి, రాజశేఖర్, మంగయ్య, మల్లేశ్‌గౌడ్, సదానంద రెడ్డి, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి ఆంజనేయులు యాదవ్, సూర్యనారాయణ, చంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, మల్లేశ్, మోహన్, బీరప్ప, నారాయణయాదవ్, పెంటయ్య, రాజు,రైతులు పాల్గొన్నారు.



# ఊరూరా అవతరణ పండుగ

- అట్టహాసంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా పండుగ వాతావరణం
- తెలంగాణ అమరవీరులకు నివాళులు
- ఎక్కడికక్కడ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

సిద్దిపేట, జూన్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ అవతరణ పండుగను జిల్లా ప్రజలు గుండెల నిండా అభిమానంతో నిర్వహించుకున్నారు. ఊరూవాడ, పల్లె, పట్నం అనే తేడా లేకుండా జనం ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పూల మాలలు వేసి అమరవీరులకు నివాళులర్పించారు. నియోజకవర్గం, మండల కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రతిచోటా జై తెలంగాణ, జయహో తెలంగాణ నినాదాలు మిన్నంటాయి.

# పథకాల పేరుతో కాంగ్రెస్ మోసం

- మళ్లీ బీఆర్ఎస్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల వద్ద బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

సిద్దిపేట అర్బన్, జూన్ 2 : పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని, కాంగ్రెస్ పథకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల వద్ద గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ మేరకు ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులతో కలిసి బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, యువతకు దగ్గర అవుదామని రాజీవ్ యువ వికాసం పేరుతో డ్రామా మొదలు పెట్టారన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం వాయిదా వేయడమంటే ప్రభుత్వం సరిగ్గా పని చేయడం లేదని అర్థమవుతుందన్నారు. ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి నడుపుతున్నాడా.. మంత్రులు నడుపుతున్నారా.. లేక ఎమ్మెల్యేలు నడుపుతున్నారా అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. ఎంతో మంది యువత ఎన్నో డబ్బులు ఖర్చు పెట్టుకొని యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నాయకులు మాత్రమే తీసుకుంటున్నారని, ఇందిరమ్మ ఇండ్లు చిన్నగా ఉండటంతో ప్రజలు తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ వాళ్లకు దమ్ము, ధైర్యం ఉంటే బీఆర్ఎస్ నాయకులతో పోరాటం చేయాలి కానీ, ప్రజలను మోసం చేయకూడదన్నారు. మీకు చేతకాకపోతే మమ్ముల్ని సూచనలు అడగండి.. లేదంటే ముఖ్యమంత్రిని మార్చి కొత్త ముఖ్యమంత్రిని తెచ్చుకోవాలని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఆదేశాలతో 14 సంవత్సరాలు సుధీర్ఘ పోరాటం చేసిన ఘనత సిద్దిపేట గడ్డకే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసేలా నిరంతరం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు, బీఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, రణం శ్రీనివాస్, వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల వద్ద బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# వేతనాలు పెంచాలని అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

గజ్వేల్, జూన్ 2 : సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో అద్దె బస్సులు నడుపుతున్న డ్రైవర్లు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోలో గత కొన్నేండ్లుగా అద్దె బస్సులపై పనిచేస్తున్న డ్రైవర్లకు పనిఒత్తిడి పెరుగుతుందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. కనీస వేతనం రూ.23 వేలు ఇవ్వాలని, రెండు జతల దుస్తులు, ప్రమాదాలు చోటు చేసుకుంటే యజమానే బాధ్యత వహించాలన్నారు. ప్రతి డ్రైవర్‌కు ఉచితంగా బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని, ప్రతినెలా ఐదో తేదీలోగా వేతనాలు ఇవ్వాలని, ఏడాదికోసారి రూ.2 వేల వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో అద్దె బస్సుల డ్రైవర్లు పాల్గొన్నారు.



గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

# నీటిపారుదలశాఖలో అవినీతి మేట



- అవినీతి ఆరోపణలతో ఇరిగేషన్ సీఈపై వేటు
- సీఈ ధర్మ ఈఎన్‌సీ కార్యాలయానికి సరెండర్
- అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశం
- ఇరిగేషన్‌శాఖలో కలకలం

సంగారెడ్డి జూన్ 2 (నమస్తే తెలంగాణ): నీటిపారుదలశాఖలో అవినీతి మేట వేస్తోంది. కింది స్థాయిలో పనిచేసే ఇరిగేషన్ ఏఈ మొదలుకుని సీఈ వరకు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల గుమ్మడిదల ఏఈ లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. తాజాగా అవినీతి ఆరోపణలపై ఇరిగేషన్ ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్ ధర్మపై బదిలీ వేటు పడింది. సంగారెడ్డి జిల్లాలో నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి సీఈగా పనిచేస్తున్న కె.ధర్మను ఆబాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించడంతో పాటు హైదరాబాద్‌లోని ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) ఆఫీస్‌కు సరెండర్ చేసింది. హైదరాబాద్ సీఈ బాధ్యతల నుంచి ధర్మను ప్రభుత్వం తప్పించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు.

### కోటిన్నర డిమాండ్ చేసినందుకే వేటు పడిందా?

సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ ఇన్‌చార్జి సీఈగా ధర్మ ఏడాది క్రితం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి సీఈగా పనిచేస్తున్న ధర్మ ప్రస్తుతం హైదరాబాద్ సీఈ (ఎఫ్ఏసీ)గా కొనసాగుతున్నారు. చెరువులు, నాలాల సమీపంలో భవనాల నిర్మాణాలకు సంబంధించి ఎన్‌వోసీ జారీలో సీఈది కీలకపాత్ర. ఎన్‌వోసీ జారీ చేసే విషయంలో కిందిస్థాయిలో పనిచేస్తున్న ఏఈ నుంచి మొదలుకుని చీఫ్ ఇంజినీర్ వరకు అందరూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎన్‌వోసీ జారీ విషయంలో ఇరిగేషన్ అధికారులు కోట్లల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇన్‌చార్జి సీఈగా ఉన్న కె.ధర్మ ఓ భవన నిర్మాణానికి ఎన్‌వోసీ జారీ చేసేందుకు యజమాని నుంచి రూ.1.50 కోట్లు డిమాండ్ చేసినట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారంలో జిల్లాలో పనిచేసిన రిటైర్డు ఎస్ఈ ఒకరు మధ్యవర్తిగా వ్యవహరించినట్లు సమాచారం. నిబంధనల మేరకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ తనను డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో సదరు యజమాని విషయాన్ని ఓ మంత్రి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. సంగారెడ్డి జిల్లాతోపాటు హైదరాబాద్ కార్యాలయంలో సైతం సీఈ పని చేస్తున్న ధర్మ గుట్టుగా అవినీతి వ్యవహారాలు సాగిస్తున్న విషయాన్ని తెలుసుకున్న సదరు మంత్రి విషయాన్ని ఇరిగేషన్ ఉన్నతాధికారులకు తెలిపారు. మంత్రి సూచన మేరకు ఇరిగేషన్ ఉన్నతాధికారులు విచారణ చేసి ధర్మపై బదిలీ వేశారు. అవినీతి ఆరోపణలపై బదిలీ వేటు పడిన ధర్మ మరో నెలరోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం. ఇటీవల గుమ్మడిదల ఏఈ రవికిశోర్ లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. రవికిశోర్ అవినీతి వ్యవహారం వెనుక ఓ ఉన్నతాధికారి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అయితే సదరు అధికారి ఏసీబీ వల నుంచి తప్పించుకున్నారు.లంచం తీసుకుంటూ ఏఈ ఏసీబీకి చిక్కటం, సీఈ స్థాయి అధికారులపై బదిలీ వేటు పడ టం ఇరిగేషన్‌లో అవినీతి ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.

### సీఈపై వేటు వెనక పొలిటికల్ వార్ ?

ఇరిగేషన్ ఇన్‌చార్జి సీఈ కె.ధర్మపై బదిలీ వేటు వెనుక పొలిటికల్ వార్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇన్‌చార్జి సీఈగా ఉన్న ధర్మ పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి అనుకూలంగా పనిచేస్తున్నట్లు సమాచారం. పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధిం చి ఎన్‌వోసీలు, ఇతర నీటిపారుదలశాఖ అనుమతులు జారీ విషయంలో సదరు ప్రజాప్రతినిధి ఏమిచెప్పినా అందుకు అనుకూలంగా ఇన్‌చార్జి సీఈ ధర్మ నిర్ణయం తీసుకునేవారని తెలిసింది. జిల్లా పాలన వ్యవహారాల్లో కీలకమైన ఓ మంత్రికి ఇది నచ్చలేదు. పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి నీటిపారుదల శాఖలో చక్రం తిప్పటాన్ని మంత్రి జీర్ణించుకోలేకపోయారని సమాచారం. పటాన్‌చెరు ప్రజాప్రతినిధికి చెక్‌పెట్టేలా ఇన్‌చార్జి సీఈ ధర్మపై వేటు పడేలా మంత్రి పావులు కదిపినట్లు తెలుస్తోంది.



గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండావిష్కరిస్తున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి

# కేసీఆర్‌తోనే తెలంగాణ సాకారం

గజ్వేల్, జూన్ 2: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ ఉద్యమ ఫలితంగా సాకారమైందని, 14ఏండ్లు ఉద్యమం చేసి తెలంగాణ సాధించారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం వారు మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై నేటితో 11ఏండ్లు పూర్తి చేసుకున్నామని, స్వరాష్ట్రంలో కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింపజేసి ఆమరణ నిరాహార దీక్ష చేసి 36 రాజకీయ పార్టీలతో తెలంగాణకు జైకొట్టించి రాష్ట్రాన్ని సాధించారన్నారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించారని, కేసీఆర్ హయాంలో అన్నివర్గాలకు న్యాయం జరిగిందన్నారు. చరిత్రలో గుర్తుండేలా అభివృద్ధి ఫలాలను ప్రజల ముందు ఉంచారని, దేశంలోనే ధనిక రాష్ట్రంగా మార్చిన చరిత్ర ఆయనకే దక్కిందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి సాగునీళ్లు అందించడంతో దేశానికి అన్నపూర్ణగా తెలంగాణ మారిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు జకీయోద్దీన్, గోపాల్ రెడ్డి, విరాసత్‌అలీ, కొట్టాల యాదగిరి, రమేశ్‌గౌడ్, రజిత, దుర్గాప్రసాద్, కనకయ్య, రవీందర్ పాల్గొన్నారు.

# సమన్వయంతో ముందుకుపోవాలి



మెదక్ కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు
- మెదక్ కలెక్టరేట్ లో జాతీయ జెండా ఆవిష్కరణ

మెదక్, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు (ప్రజా వ్యవహారాలు) కేశవరావు జాతీయ జెండాను సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఇతర ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ఆవరణలో ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. మెదక్ జిల్లాను అన్ని రంగాల్లో, అభివృద్ధి పథంలో ముందుంచాలని కోరుతూ, నిరంతరం ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ ప్రజలను చైతన్యపర్చాలన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మైపాల్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎఫ్ జోజి, డీపీవో యాదయ్య, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నాణ్యమైన విత్తనం..రైతన్నకు నేస్తం

మెదక్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ప్రాంగణంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసినిరెడ్డి, హౌసింగ్ పీడీ మాణిక్యం, జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు రైతులకు విత్తనాలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రైతులకు నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం' ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా నోడల్ అధికారి, శాస్త్రవేత్త రాహుల్‌విశ్వకర్మ, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.